

వానే వాన

- అల్పపీడనం ప్రభావంతో జిల్లావ్యాప్తంగా కుండపోతగా వర్షం
- గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం రోజంతా ఎడతెరిపిలేకుండా వానేవాన
- శనివారం రాత్రికి వాయుగుండంగా బలపడనున్న తీవ్ర అల్పపీడనం
- మరో రెండురోజులపాటు భారీవర్షాలు పడతాయంటున్న వాతావరణశాఖ
- తీరం వెంబడి బలమైన గాలులు వీస్తాయని, మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరిక
- భారీ వానతో కాకినాడ పోర్టు నుంచి నిలిచిన బియ్యం ఎగుమతులు
- వరి, ఇతర వాణిజ్య పంటల్లోకి చేరుతున్న నీరు
- ముసురుతో పెరుగుతున్న జ్వరాల తీవ్రత

వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం బలపడడంతో జిల్లావ్యాప్తంగా కుండపోతగా వర్షాలు కురుస్తున్నాయి. ప్రస్తుతం అల్పపీడనం కాస్త తీవ్ర అల్పపీడనంగా మారింది. దీని ప్రభావంతో గురువారం అర్ధరాత్రి నుంచి జిల్లావ్యాప్తంగా వర్షాలు అధికమయ్యాయి. తీవ్ర అల్పపీడనం శుక్రవారం మధ్యాహ్నం నుంచి వాయుగుండంగా మారేదిశగా కదులుతుండడంతో దీని ప్రభావంతో జిల్లావ్యాప్తంగా రోజంతా ఎడతెరిపిలేకుండా వర్షం పడుతూనే ఉంది. కాకినాడ నగరంతోపాటు జిల్లావ్యాప్తంగా అనేక మండలాల్లో శుక్రవారం రోజంతా ఏకధాటిగా వర్షం కురిసింది. వాతావరణం పూర్తిగా చల్లబడిపోయి చీకటి కమ్ముకుంది. అటు వర్షాలతో రోజంతా జనజీవనం కూడా స్తంభించింది.



తునిరూరల్‌లోని చామవరంలో పత్తి చేలోకి చేరిన వర్షం నీరు



కాకినాడ నగరంలో..



పిఠాపురంలో కురుస్తున్న వర్షం..



నీటమునిగిన రహదారి



అన్నవరంలో వర్షం

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

జిల్లా కేంద్రంతోపాటు పట్టణాల్లోను వర్షం కారణంగా ఎక్కడా రద్దీ కనిపించలేదు. జనం కూడా ముసురు వాతావరణంతో ఇళ్లనుంచి బయటకు రాలేదు. కాగా శనివారం రాత్రికి తీవ్రఅల్పపీడనం పూర్తిగా వాయుగుండంగా మారనుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. తీవ్ర అల్పపీడనం రాగల 24గంటల్లో ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాలవైపు కదులుతూ వాయుగుండంగా మారనుందని పేర్కొంది. దీని ప్రభావంతో శని, ఆదివారాల్లో మోస్తరునుంచి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ప్రధానంగా శనివారం తీరం వెంబడి గంటకు 45నుంచి 65 కిలోమీటర్ల వేగంతో సముద్రంలో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. ఈనేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని హెచ్చరించింది. కాగా తీవ్ర అల్పపీడనం ప్రభావంతో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం అర్ధరాత్రి వరకు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఎక్కడికక్కడ లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జిల్లా కేంద్రం కాకినా డలో కురిసిన వర్షానికి ఎక్కడికక్కడ ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోని వార్డుల్లో నీరు నిలిచిపోయింది. అటు రోజంతా నగరంలో జనసంచారం కూడా తగ్గిపోయింది. ఏకధాటి వర్షంతో శుక్రవారం మధ్యాహ్నం నుంచి అనేక వాణిజ్య దుకాణాలు మూతబడ్డాయి. జిల్లావ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలు, గ్రామా ల్లోను ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తూనే ఉంది. అటు ఆఖరి శ్రావణ శుక్రవారం కావడంతో పెద్దఎత్తున భక్తులు ఆలయాలకు పోటెత్తారు. వర్షంలో తడుస్తూనే పలు ఆలయాల్లో సామూహిక వ్రతాలకు హాజరయ్యారు. కాగా తీవ్ర అల్పపీడనం ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా మారింది. వర్షానికి తోడు ఈదురుగాలులు కూడా వీస్తుండడంతో కాకినాడ పోర్టు నుంచి విదేశాలకు బియ్యం ఎగుమతులు శుక్రవారం నిలిచిపోయాయి. మూడు విదేశీ నౌకల్లోకి బియ్యం లోడింగ్ ఆగిపోయింది. వర్షం ఎక్కువగా ఉండడంతో యాంకరేజ్ పోర్టు నుంచి బార్జిల్లోకి బియ్యం లోడింగ్ వీలుపడలేదు. దీంతో నౌకల వద్దకు రవాణా నిలిచిపోయింది. మరోపక్క ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలో పలుచోట్ల వరితోపాటు ఇతర వాణిజ్య పంటల్లోకి నీరు క్రమేపీ చేరుతోంది. తునిరూరల్‌లో తాండవకు నీరు పోటెత్తుతోంది. దీంతో పలుచోట్లలోతట్టు ప్రాంతాల్లోని చేలల్లోకి నీరు అంతకంతకూ పెరుగుతోంది. దీంతో తుని రూరల్‌లోని పలుచోట్ల పత్తి పంటకు నష్టం వాటిల్లింది.

మారిన వాతావరణంతో జిల్లావ్యాప్తంగా జ్వరాల తీవ్రత మరింత పెరిగింది. ఎక్కడ చూసినా కాకినాడ నగరంతోపాటు పట్టణాలు, పల్లెల్లోను జనం మలేరియా, డెంగీ బారిన పడి మంచం పట్టారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నిర్వహిస్తున్న ఫీవర్ సర్వేలోను వారానికి వేలల్లో బాధితుల సంఖ్య తేలుతోంది. తాజాగా వర్షాలతో జ్వరాల ముప్పు మరింత పెరిగే అవకాశం ఉంది.

మండలాల్లో వర్షపాతం

ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో శుక్రవారం తొండంగిలో 2.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. తాళ్లరేవు 2.6, కాకినాడ రూరల్ 2.4, పిఠాపురం 1.9, పెదపూడి 1.8, తుని 1.7, శంఖవరం 1.7, కోటనదూరు 1.6, యు.కొత్తపల్లి 1.5, రౌతులపూడి 1.4, ఏలేశ్వరం 1.1 సెంటీమీటర్ల చొప్పున వర్షం కురిసింది.

ఇన్‌ఫెక్షన్ల పట్ల జాగ్రత్తగా ఉండాలి

- జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ లావణ్యకుమారి

జీజీహెచ్(కాకినాడ), ఆగస్టు 30: మనల్ని మనం కాపాడుకుంటూ రోగులకు వైద్యచికిత్స, సేవలందించాలని కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి సూచించారు. జీజీహెచ్ పరిపాలనా విభాగ సమావేశ మందిరంలో శుక్రవారం ఆమె వైద్యులు, సిబ్బందికి ఇన్‌ఫెక్షన్లపై మార్గనిర్దేశకాలు చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఆస్పత్రిలో విధులు నిర్వర్తించే వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, టెక్నికల్ సిబ్బంది ఇన్‌ఫెక్షన్లకు గురికాకుండా ఎటువంటి ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలో వివరించారు. ప్రస్తుత సీజన్‌లో విస్తరించే వైరల్ ఫీవర్ల వల్ల వైద్యం అందించే వారికి కూడా ఇన్‌ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉందని, ఈ నేపథ్యంలో ప్రతిఒక్కరూ మాస్క్ ధరించడం, శానిటైజర్ వాడడం, ప్రతి వార్డును పరిశుభ్రంగా ఉంచడం వంటి ముందస్తు జాగ్రత్తలు చేపడితే ఎటువంటి వ్యాధులు దరి చేరవన్నారు. కార్యక్రమంలో మైక్రోబయాలజీ హెచ్‌వోడీ డాక్టర్ పీవీ ప్రసన్నకుమార్, అనస్థీషియా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉమామంజులా, మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ యశోధమ్మ, హాస్పటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ యమున, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వనమహోత్సవానికి.. సర్వం సిద్ధం

- 1 నుంచి 30 వరకు కార్యక్రమాలు
- ఎన్‌జీవోలకు 40వేల మొక్కల పంపిణీ
- పలుచోట్ల లాంఛనంగా ప్రారంభం



పెద్దాపురంలోని ఓ నర్సరీలో పంపిణీకి సిద్ధంగా ఉన్న మొక్కలు

కాకినాడ సిటీ, ఆగస్టు 30: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా అమలు చేస్తున్న వనమహోత్సవం కార్యక్రమానికి జిల్లా అటవీశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వనమహోత్సవం కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. జిల్లాలో పలుచోట్ల ప్రజాప్రతినిధులు, అధికారులు మొక్కలు నాటి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సెప్టెంబరు 1 నుంచి 30 వరకు మొ క్కలునాటే కార్యక్రమాలు నిర్వహించనున్నారు. హరితాంధ్ర కోసం అడుగేద్దాం.. ప్రతిఒక్కరం మొక్కలు నాటుదాం.. నినాదంతో అటవీశాఖ ఈ కార్యక్రమాన్ని తలపెట్టింది. ఇందుకుగాను జిల్లాలో ఇప్పటివరకు ఎన్‌జీవోలు, స్వచ్ఛంద సంస్థలు, ఇతరత్రా సంస్థలకు 40వేల వరకు మొక్కలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ మేరకు కాకినాడ జిల్లా సబ్ డివిజనల్ అటవీశాఖ అధికారిణి అనూష నేతృత్వంలో అటవీశాఖ సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు. జిల్లా భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా నేరేడు, చింత, ఉసిరి, మారేడు, కళంబ, వేప వంటి మొక్కలను నర్సరీల్లో పెంచారు. పెద్దాపురం, కాకినాడ బోట్ క్లబ్ నర్సరీల నుంచి నాలుగురోజులుగా ముమ్మరంగా మొక్కలు సరఫరా చేశారు. కలెక్టర్ నిర్దేశించిన నామమాత్రపు ధరకు కొన్ని రకాల పూలు, పండ్ల మొక్కలను అందుబాటులో ఉంచారు. స్వచ్ఛంద సంస్థలు, వలంటీర్లు, జనసైనికులు ఈ మొక్కలను నాటేందుకు తీసుకెళ్తున్నారు. సోషల్ ఫారెస్టరీ రేంజర్ బీఎస్ పద్మజ పర్యవేక్షించారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

- కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్
- జేఎన్టీయూకేలో ఘనంగా వనమహోత్సవం
- పాల్గొన్న కలెక్టర్ షాన్‌మోహన్, కమిషనర్ భావన

జేఎన్టీయూకే, ఆగస్టు 30: భవిష్యత్ తరాలకు సురక్షితమైన పర్యావరణాన్ని అందించేలా ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని తద్వారా సమాజానికి మేలు చేసిన వారమవుతామని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ అన్నారు. జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో జేఎన్టీయూకేలో శుక్రవారం నిర్వహించిన వనమహోత్సవంలో ఎంపీ, కలెక్టర్ షాన్‌మోహన్, కాకినాడ కమిషనర్ భావన, జేసీ రాహుల్‌మీనా ముఖ్యఅతిథులుగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఏపీని హరితాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వం వనమహోత్సవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. దీనిద్వారా కాకినాడ పార్లమెంట్ పరిధిలోని ప్రతి గ్రామంలోను మొక్కలునాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఎక్కడ చూసినా కాలుష్యం ఆవరించి ఉందని విరివిగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టడం ద్వారా సమాజానికి మేలు చేసిన వారమవుతామని తెలిపారు. అనంతరం వర్సిటీలోని అలూమ్నీ ఆడిటోరియంలో కళాశాల విద్యార్థులతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొక్కలునాటే కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా తన పాఠశాల, కళాశాల విద్యాభ్యాసం రోజులు గుర్తుకు వచ్చాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో నేడు పెద్దఎత్తున మొక్కలునాటే కార్యక్రమం చేపట్టామన్నారు. రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణం ప్రకారం 33శాతం అటవీప్రాంతం ఉండాలని కానీ రాష్ట్రంలో 29.3శాతం అటవీప్రాంతం మాత్రమే ఉందన్నారు.



వర్సిటీ ఆవరణలో మొక్కను నాటి నీరుపోస్తున్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్



కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

వనమహోత్సవం, ప్రకృతి పిలుస్తోంది వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించామన్నారు. జేఎన్టీయూకే రెక్టార్ కేవీ రమణ మాట్లాడుతూ వర్సిటీలో వివిధ రకాల మొక్కల పెంపకానికి కృషి చేస్తామన్నారు. కమిషనర్ భావన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జేసీ రాహుల్‌మీనా తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు, విద్యార్థులతో కాకినాడ జిల్లా సబ్‌డివిజనల్ అటవీశాఖ అధికారిణి అనూష ప్రతిజ్ఞ చేయించారు. అటవీశాఖ రూపొందించిన పోస్టర్‌ను అధికారులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీపీవో కె.భారతిసౌజన్య, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, సమాచారశాఖ డీడీ నాగార్జున, జిల్లా సైనిక సంక్షేమ అధికారి కృష్ణారావు, అటవీశాఖ సిబ్బంది, జేఎన్టీయూకే, ఆదిత్య కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రావణ శుక్రవారం.. సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



పిఠాపురం పాదగయ క్షేత్రంలో సామూహిక వరలక్ష్మీవ్రతాలు ఆచరిస్తున్న మహిళలు

గణేష్ ఉత్సవాలకు సింగిల్ విండో విధానంలో అనుమతులు

కాకినాడ క్రైం, ఆగస్టు 30: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతిష్టాత్మక గణేష్ ఉత్సవాల నిర్వహణకు సింగిల్ విండో విధానంలో అనుమతులు జారీ చేయనున్నట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. అనుమతులను సులభతరం చేసేందుకు వీలుగా ప్రభుత్వం శుక్రవారం ప్రత్యేక పోర్టల్‌ను ఆవిష్కరించిందన్నారు. వినాయక చవితి నవరాత్రుల్లో భాగంగా జరిగే ఉత్సవాల కోసం నిర్వాహకులు 7995095800 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా ఏజీ అని సందేశం పంపించిన వెంటనే ఎన్‌వోసీ పత్రం జారీ కోసం అనుసరించాల్సిన ప్రక్రియ మీ వాట్సాప్‌కు మెసేజ్ వస్తుందన్నారు. ఉత్సవాల నిర్వహణకు అన్నిరకాల అనుమతులను మంజూరుకు ప్రభుత్వం సింగిల్ విండో విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఈ విధానం వల్ల మండపాల నిర్వహణ, ఏర్పాటు, ఊరేగింపులు, నిమజ్జనాలకు మీసేవలో చలానాచెల్లించి ఎన్‌వోసీ పత్రం, క్యూఆర్ కోడ్‌ను పొందవచ్చన్నారు.

ఇలా నమోదు చేసుకోవాలి

నిర్వాహకులు ముందుగా http://ganeshutsav.net వెబ్‌సైట్‌లో లాగిన్ అయి న్యూఅప్లికేషన్‌పై క్లిక్ చేసి దరఖాస్తు చేస్తున్న వ్యక్తి ఫోన్ నెంబరును నమోదు చేస్తే ఓటీపీ వస్తుందన్నారు. ఈ ఓటీపీ నెంబర్ నమోదు చేసిన తర్వాత మొబైల్ నెంబర్ వెరిఫికేషన్ పూర్తయిన వెంటనే దరఖా స్తు విండో ఓపెన్ అవుతుందన్నారు. దరఖాస్తు ఫారంలో నిర్వాహకుడి పే రు, ఈ-మెయిల్ అడ్రసు, చిరునామా, అసోసియేషన్ పేరు, గణేష్ ఉత్స వాలు నిర్వహిస్తున్న స్థలం, చిరునామా, ఏ సబ్ డివిజన్, ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి ఉత్సవాలు నిర్వహించే స్థలం వస్తుందన్న విషయాలను నమో దు చేయాలన్నారు. విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు వివరాలు పూర్తి చేయాలన్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యుల పేర్లు, ఫోన్ నెంబర్లు, నిమజ్జన నిర్వహించే తేదీ, సమయం, నిమజ్జనానికి ఉపయోగించే వాహనాల వివరాలను నమోదు చేయాలన్నారు. తదనంతరం అధికారులు ఉత్సవాల నిర్వహించే స్థలాన్ని పరిశీలించే తేదీ, సమయం, షెడ్యూలు అందిస్తారన్నారు. వేడుకల్లో శాంతి భద్రతల సమస్యలకు, మతపరమైన సంఘర్షణలకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించుకోవాలన్నారు.

చవితి ఉత్సవాలు విజయవంతం చేయాలి: జేసీ

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 30: వచ్చేనెల 7 నుంచి జిల్లాలో వినాయక చవితిని పురస్కరించుకుని జరిగే నిమజ్జన వేడుకలను విజయవంతం చేయాలని జేసీ రాహుల్ మీనా ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో శుక్రవారం వినాయక చవితి, నిమజ్జన ఉత్సవాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జనం సాగే మార్గాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పర్యావరణానికి హానికల్గకుండా ఉత్సవాలను చేయాలన్నారు. విగ్రహాల తయారీకి రసాయన రంగులు వాడకుండా సహజసిద్ధమైన రంగులను మాత్రమే వినియోగించాలన్నారు. మట్టితో తయారు చేసిన విగ్రహాలను ప్రతిష్ఠించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ, పోలీసు, విద్యుత్, అగ్నిమాపకశాఖలనుంచి అనుమతులు లభించిన తర్వాత మాత్రమే కమిటీ విగ్రహ ప్రతిష్ఠ చేయాలన్నారు. నిమజ్జనం ముందు తర్వాత నీటి కాలుష్యాన్ని పరీక్షించాలన్నారు. కాకినాడలో నిమజ్జనం చేపట్టే ఘాట్‌వద్ద చేపడుతున్న ఏర్పాట్లను మున్సిపల్ అధికారులకు వివరించారు. డీఆర్వో తిప్పేనాయక్, ఆర్డీవోలు సీతారామరావు, కిషోర్, నగర ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షుడు డి.రమణరాజు పాల్గొన్నారు.

నేడే పింఛన్ల పంపిణీ

- 2,76,693మందికి రూ.116కోట్లు సిద్ధం
- ఒకరోజు ముందే ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు అందించనున్న సచివాలయ ఉద్యోగులు

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 30: జిల్లాలో శనివారం ఉదయం 6 గంటల నుంచి ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధంగా ఉంది. గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగులతో పింఛన్ల పంపిణీ చేస్తున్నారు. సెప్టెంబర్ ఒకటో తేదీ ఆదివారం రావడంతో ఒకరోజు ముందే పింఛన్లను పంపిణీ చేసి పింఛన్‌దారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని నిరూపించారు. జిల్లాలో 2,76,693 పింఛన్‌దారులకు రూ.116.44కోట్లు నిధులు సిద్ధంగా ఉంచారు. దీనిలో డప్పు కళాకారులు 1591మందికి రూ.63లక్షలు, దివ్యాంగులు 35296 మందికి రూ.21కోట్లు, మత్స్యకారులు 6349మందికి రూ.2.5కోట్లు, అనారోగ్య సమస్యలున్న పింఛన్‌దారులు 781మందికి రూ.88లక్షలు, ఓఏపీ పింఛన్‌దారులకు రూ.54కోట్లు కేటాయించారు. చిత్రకళాకారులకు రూ.3.96లక్షలు, ఒంటరి మహిళలు 7,862మందికి రూ.3.14కోట్లు, 3,497మంది చేనేత కార్మికులకు రూ.1.39కోట్లు, వితంతువులు 73,286మందికి రూ.29కోట్లు, ట్రాన్స్‌జెండర్ కేటగిరిలో 109మందికి రూ.4.36లక్షలు నిధులు కేటాయించారు. ఇలా వివిధ కేటగిరీల్లో పింఛన్ల సొమ్ము సిద్ధంగా ఉంచారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ షాన్‌మోహన్ అన్ని వార్డు, గ్రామ సచివాలయాలకు ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేశారు. తొలిరోజే నూరుశాతం పింఛన్ల పంపిణీ చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో జాప్యం చోటు చేసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. గతనెలలో పింఛన్ల పంపిణీలో జాప్యంవల్ల 20మంది సచివాలయం ఉద్యోగులకు కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీచేశారు. ఈ నేపథ్యంలో ఎట్టిపరిస్థితిలో తొలిరోజే నూరుశాతం పంపిణీ చేయాలని ఆదేశించారు.

వాకలపూడి బీచ్ పార్కును అభివృద్ధి చేయాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 30: కాకినాడ రూరల్ మండలంలో వాకలపూడిలో ఉన్న ఎన్‌టీఆర్ బీచ్ పార్కును సందర్శకులకు అనువుగా ఉండేలా అభివృద్ధి చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో ఆయన శుక్రవారం ఆయన పర్యాటకశాఖ, పంచాయతీలు, తీరప్రాంత కార్యకలాపాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 2వతేదీకల్లా ఎన్‌టీఆర్ బీచ్ పార్కు సందర్శకులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. దీన్ని ప్లాస్టిక్ రహిత, పర్యావరణ సహిత, క్లీన్ అండ్ గ్రీన్‌గా నిర్వహించాలన్నారు. శిల్పారామం, బీచ్ ఫ్రంట్ పర్యాటక ప్రదేశాలవద్ద ప్రభుత్వ భూముల వివరాలను సర్వే నెంబర్లతో పరిశీలించి కేటాయించాలన్నారు. శిల్పారామంవద్ద నుంచి నీటి వసతి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బీచ్‌పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. సెలవురోజుల్లో సందర్శకులు వాకలపూడి బీచ్‌కు వస్తున్నందున వీటి అభివృద్ధికి వేగవంతంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్పొరేషన్ కమిషనర్ భావన, జేసీ రాహుల్‌మీనా, ట్రైనీ కలెక్టర్ భావన, జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య, సర్వేశాఖ ఏడీ లక్ష్మీనారాయణ, పర్యాటకశాఖ రీజినల్ డైరెక్టర్ స్వామినాయుడు పాల్గొన్నారు.

పారదర్శకంగా మహిళా పోలీసుల బదిలీ ప్రక్రియ

కాకినాడ క్రైం, ఆగస్టు 30: జిల్లా పోలీసు కార్యాలయంలో కాకినాడ పోలీస్ కన్వెన్షన్ హాల్లో శుక్రవారం ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు(మహిళా పోలీసులు) బదిలీ ప్రక్రియ పారదర్శకంగా జరగడంపట్ల వారు ఆనందం వ్యక్తం చేశారు. బదిలీ ప్రక్రియలో భాగంగా మహిళా పోలీసులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యాలను బట్టి విధులు నిర్వహించాలన్నారు. గ్రామస్థులకు, పోలీసులకు మధ్య వారధిగా ఉంటూ పోలీసుశాఖతో అనుసంధానంగా పనిచేసి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా అందరికీ ఆయన అభినందనలు తెలిపారు. అనంతరం సీనియారిటీ ప్రకారం కోరుకున్న విధంగా బదిలీ ప్రక్రియ నిర్వహించారు. ఖాళీలను బట్టి, ముఖ్యంగా దివ్యాంగులకు అధిక ప్రాధాన్యం ఇచ్చిన ఎస్పీకి వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, ఎస్‌ఈబీ ఏఎస్పీ కె.శ్రీలక్ష్మి, డీపీవో సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ప్రత్యేకాధికారిగా వీరపాండ్యన్



కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 30: జిల్లా ప్రత్యేకాధికారిగా ఐఏఎస్ అధికారి జి.వీరపాండ్యన్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు వెలువరించింది. ఆయన ప్రభుత్వం పథకాల పనితీరును జిల్లాలో నిత్యం పర్యవేక్షించనున్నారు. వాటి అమలు సమర్థవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటారు.



సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు



శ్రావణలక్ష్మీ రావమ్మా... వరాలివ్వమ్మా

వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు... భక్తజనసంద్రమైన పిఠాపురం పాదగయ క్షేత్రం

పిఠాపురం, ఆగస్టు 30:

దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన పాదగయ క్షేత్రం శ్రావణ శోభతో విరాజిల్లింది. మహిళా భక్తులతో కిటకిటలాడింది. వేద పండితుల మంత్రోచ్చారణలతో సంప్రదాయబద్ధంగా నిర్వహించిన వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొనేందుకు వర్షంలోనూ మహిళలు భారీగా తరలివచ్చారు. పూజల్లో పాల్గొన్న వారికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పంపిన చీరలు, పసుపు, కుంకుమ అందజేశారు.

కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠానికి అధిష్ఠాన దేవత అయిన పురుహూతికా అమ్మవారు, ఆదిశంకరాచారులు ప్రతిష్ఠించిన రాజరాజేశ్వరీదేవి, స్వయంభూ కుక్కుటేశ్వర స్వామి సన్నిధిలో వ్రతాలు ఆచరించేందుకు మహిళలు భారీగా తరలివచ్చారు. తొలుత మూడు బ్యాచ్‌లుగా వ్రతాలు నిర్వహించాలని భావించినా మహిళలు అధికంగా తరలిరావడంతో ఉదయం ఐదు నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నాలుగు విడతలుగా వ్రతాలు జరిపించారు. ఆలయ ప్రాంగణం, దత్తాత్రేయ మండపం, చండీ హోమ ప్రదేశం, సరస్వతీదేవి మందిరం సహా ఆలయమంతా మహిళలు కూర్చునేలా ఏర్పాట్లు చేశారు. జనసేన ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబు సతీమణి పద్మజతో పాటు ఆరు వేల మందికి పైగా మహిళలు వరలక్ష్మీ వ్రతం ఆచరించారు.

వేదమంత్రోచ్చారణలతో శ్రావణ లక్ష్మికి శాస్త్రోక్తంగా పూజలు జరిగాయి. వ్రతంలో పాల్గొన్న భక్తులకు కొబ్బరికాయ, గాజులు, పసుపు, కుంకుమ, అరటి పళ్లు, పువ్వులు తదితర పూజా సామగ్రి, చీర, జాకెట్టు, వరలక్ష్మి రూపు అందజేశారు. అనంతరం పులిహోర, చక్రపొంగలి ప్రసాదం ప్యాకెట్లు పంపిణీ చేశారు. పాదగయ క్షేత్రంలో వస్తున్న సంప్రదాయం, ఆనవాయితీకి అనుగుణంగా చీరలు, పసుపు, కుంకుమ, గాజులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్‌కల్యాణ్ సమకూర్చారు. వీటిని భక్తులకు జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు సతీమణి పద్మజ, ఎమ్మెల్సీ హరిప్రసాద్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు అందజేశారు.

శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేని వర్షం కురుస్తున్నా భక్తులు భారీగా తరలివచ్చారు. తొలి బ్యాచ్ ఉదయం 5 గంటలకు ప్రారంభిస్తామని ప్రకటించడంతో అప్పటికే క్యూలైన్లలోకి చేరారు. క్యూలైన్ నుంచి ఆలయంలోకి వెళ్లే చోటే చీరలు, సామగ్రి అందజేశారు. వర్షం తగ్గకపోవడంతో టెంట్ల నుంచి నీరు కారడంతో కొంత ఇబ్బంది కలిగింది.

పిఠాపురం నియోజకవర్గంలోని ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలనే భావనతో సంప్రదాయాన్ని గౌరవిస్తూ వ్రతంలో పాల్గొన్న ప్రతి ఆడపడుచుకు పవన్‌కల్యాణ్ చీర, గాజులు, పసుపు, కుంకుమ పంపించారని ఎమ్మెల్సీ హరిప్రసాద్ తెలిపారు. వరలక్ష్మీ వ్రతాల్లో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, ఎమ్మెల్సీ హరిప్రసాద్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, జనసేన నాయకులు, వీర మహిళలు, జన సైనికులు, ఆలయ ఈవో, సహాయ కమిషనరు దుర్గాభవాని, పిఠాపురం సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.



వ్రతమాచరిస్తున్న జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు సతీమణి పద్మజ





వ్రతమాచరిస్తున్న ఈవో, సహాయ కమిషనరు దుర్గాభవాని

రత్నగిరిపై ఘనంగా ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

అన్నవరం, ఆగస్టు 30: శ్రావణ మాసం చివరి శుక్రవారం అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వ్రతాలకు కాకినాడ జిల్లా నలుమూలల నుంచి అశేష సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. ఉదయం 8 గంటలకు నిత్య కల్యాణ మండపంలోని ప్రత్యేక వేదికపై సత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవారిని, మరో వేదికపై సిరులిచ్చే వరలక్ష్మీ దేవిని ఆశీనులు గావించారు. దేవస్థానం పీఆర్వో కృష్ణారావు, ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం జ్యోతిప్రజ్వలనతో వ్రతాలను ప్రారంభించారు. వ్రత పురోహిత ముఖ్యుడు చామర్తి కన్నబాబు ఆధ్వర్యంలో మహిళలతో గణపతి పూజ, పుణ్యాహవచనం, అమ్మవారికి అష్టోత్తర, శతనామ పూజ చేయించారు. చతుర్వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. 6,200 మంది మహిళలు వ్రతాల్లో పాల్గొన్నారని ఆలయ అధికారులు వెల్లడించారు. వారందరికీ జాకెట్టు ముక్క, అమ్మవారి గాజులు, ప్రసాదంతో పాటు ఉచిత దర్శనం కల్పించి అన్న ప్రసాదాలు అందజేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏపీఆర్వో ఎం.గణపతి, సూపరింటెండెంట్ స్వామీజీ ఏర్పాట్లు చేశారు.



ప్రత్యేక వేదికపై ఆశీనులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవారు, వరలక్ష్మీ దేవి (ఫైల్), వ్రతమాచరిస్తున్న మహిళలు



ఎమ్మెల్సీ పదవికి, వైసీపీకి పద్మశ్రీ రాజీనామా

ఆమె బాటలోనే మరికొంతమంది మాజీ కార్పొరేటర్లు!



కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 30: ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ తన పదవికి, వైసీపీకి రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని ఆమె శాసనమండలి చైర్మన్‌కు శుక్రవారం అందజేశారు. పద్మశ్రీ మత్స్యకార మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలిగా, మత్స్యకార సంక్షేమ సమితి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా పనిచేసి వైసీపీలో చేరారు. 2023 మార్చిలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆమెను గవర్నర్ కోటా నుంచి వైసీపీ అభ్యర్థిగా ప్రకటించారు. ఆగస్టు 9న ఎమ్మెల్సీగా నియమిస్తూ అప్పటి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. కాగా పద్మశ్రీ బాటలోనే మరికొంతమంది వైసీపీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు పార్టీకి రాజీనామా చేసే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి వైసీపీ నేతలు ఎవరూ బయటకు కనిపించకపోవడంతో ఈ అనుమానాలు మరింత ఎక్కువవుతున్నాయి.



పోస్టర్ విడుదల చేస్తున్న ప్రో చాన్సలర్ సతీష్‌రెడ్డి

13, 14 తేదీల్లో 'ఆదిత్య వేద-2కే24' టెక్ ఫెస్ట్

గండేపల్లి, ఆగస్టు 30: కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆదిత్య వేద-2కే24 పేరిట జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్‌ను సెప్టెంబరు 13, 14 తేదీల్లో నిర్వహించనున్నట్టు ప్రో చాన్సలర్ డాక్టర్ ఎస్.సతీష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన పోస్టర్‌ను విడుదల చేశారు. వివిధ విభాగాల్లో పేపర్, పోస్టర్, ప్రాజెక్టు ప్రజంటేషన్, క్విజ్ పోటీలు జరుగుతాయని, విజేతలకు నగదు, జ్ఞాపిక ప్రశంసాపత్రం అందజేస్తామని చెప్పారు. రాష్ట్రంలో పాటు ఇతర రాష్ట్రాల్లోని ఇంజనీరింగ్ కాలేజీల విద్యార్థులకు పోటీల్లో పాల్గొనాలని ఆహ్వానం పంపామని చెప్పారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎంటీ శ్రీనివాస్, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ డోలా సంజయ్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, డీన్ వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

రేప్ కేసులో ముద్దాయికి పదేళ్ల జైలు

ఉప్పలగుప్తం, ఆగస్టు 30: రేప్ కేసులో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లి పంచాయతీ పెదరాఘవులపేటకు చెందిన కొప్పాడి నాగరాజు(31)కు కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించింది. అమలాపురం రూరల్ సీఐ వి.వీరబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... 2012లో పెదరాఘవులపేట ఎంపీపీ పాఠశాలలో విద్యా వలంటీరుగా పని చేసిన నాగరాజు సహచర వలంటీరు అయిన అదే గ్రామానికి చెందిన ఓలేటి కుమారి (31)ని పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా అనుభవించాడు. అనంతరం పెళ్లికి ససేమిరా అనడంతో మోసపోయానని తెలుసుకున్న బాధితురాలు 2019లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి ఉప్పలగుప్తం ఎస్ఐ ఎన్.సన్యాసినాయుడు కేసు నమోదు చేశారు. వాదోపవాదాల అనంతరం నేరం నిర్ధారణ కావడంతో సెషన్స్ కోర్టు జడ్జి వై.బెన్నయ్యనాయుడు ముద్దాయికి పదేళ్ల జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

13 మంది బాలికలు డిశ్చార్జి

ఏలేశ్వరం, ఆగస్టు 30: కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన 24 మందిలో 13 మందిని శుక్రవారం డిశ్చార్జి చేశామని ఏలేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రి సూపరిటెండెంట్ శైలజ తెలిపారు. మిగిలిన 11 మందికీ మెరుగైన వైద్యం అందిస్తున్నమని, త్వరలోనే కోలుకుంటారని ఆమె చెప్పారు.

నమ్మించి మోసం చేశాడు

ఒడిసా చేపల వ్యాపారి కిడ్నాప్‌తో రూ.4.50 కోట్లు నష్టపోయాం

అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న బాధిత రైతులు

అమలాపురం టౌన్, ఆగస్టు 30: రైతుల చెరువుల వద్ద నుంచి చేపలను పెద్ద మొత్తంలో దఫదఫాలుగా కొనుగోలు చేసి సొమ్ములు చెల్లిస్తామని మోసగించిన ఒడిసా చేపల వ్యాపారి సంజయ్ కలాసీని పోలీసులు తక్షణం అదుపులోకి తీసుకుని తమను ఆదుకోవాలని కోరుతూ శుక్రవారం రాత్రి ఉప్పలగుప్తం, కాట్రేనికోన మండలాలకు చెందిన బాధిత రైతులు పలువురు అమలాపురం పట్టణ పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. రైతులకు సొమ్ములు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఒడిసాకు చెందిన సంజయ్ కలాసీని గురువారం కొందరు కిడ్నాప్ చేశారన్న సమాచారంతో రైతులు మరోసారి రోడ్డెక్కారు. చేపల వ్యాపారి కిడ్నాప్‌కు, తమకు ఎటువంటి సంబంధం లేదన్నారు. ఎస్.యానంకు చెందిన స్వామినాయుడు సహకారంతోనే మూడేళ్ల క్రితం సంజయ్ కలాసీకి సరుకు ఇచ్చామన్నారు. సొమ్ములు అప్పుడు చెల్లిస్తా, ఇప్పుడు చెల్లిస్తా అంటూ మోసం చేస్తు న్న తీరుపై సంజయ్ కలాసీపై గతంలో పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఆ వ్యవహారం మరుగున పడిందన్నారు. ఉప్పలగుప్తం, కాట్రేనికోన మండలాలకు చెందిన తామంతా రూ.4.50 కోట్ల మేర నష్టపోయామని విలేకరులకు వివరించారు. సంజయ్ కలాసీని పోలీసులు అదుపులోకి తీసుకుని తమ సొమ్ములు తమకు ఇప్పించి ఆదుకోవాలని రైతులు దంగేటి నరసింహారావు, ఆకుల జోగయ్యనాయుడు, ఎన్.శ్రీనివాసరావు, వైదాడి నాగేశ్వరరావు, కొప్పాడి దుర్గారావు తదితరులు కోరుతున్నారు.



కలాసీని అరెస్టు చేసి ఆదుకోవాలని కోరుతున్న ఉప్పలగుప్తం, కాట్రేనికోన మండలాల రైతులు

హరికథా కళాకారుడు మృతి

ఉప్పలగుప్తం, ఆగస్టు 30: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం గ్రామానికి చెందిన ప్రముఖ హరికథ కళాకారుడు చిక్కం కృష్ణమూర్తి భాగవతార్ (71) శుక్రవారం మృతి చెందారు. టీటీడీ ఆధ్వర్యంలో ఆయన పలు రాష్ట్రాల్లో హరికథా గానం చేశారు. దూరదర్శన్, ఆకాశవాణి కళాకారుడిగా ప్రఖ్యాతిగాంచారు. ఆయనకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు నాగబాబు కూడా హరికథా కళాకారుడే. కృష్ణమూర్తి భాగవతార్ మృతికి గ్రామస్తులతో పాటు ఎంపీపీ దంగేటి వీరఅచ్యుతజానకీరాంబాబు, సర్పంచ్ కడిమి చిన్నవరాజు, ఉప సర్పంచ్ మోకా శ్రీనివాసరావు తదితరులు సంతాపం తెలిపారు.



చిక్కం కృష్ణమూర్తి భాగవతార్ (పాత చిత్రం)

పెన్షన్ల పంపిణీలో గ్రామ వలంటీర్ల చేతివాటం

రూ.14లక్షలు రికవరీకి ఆదేశాలు

రాజవొమ్మంగి, ఆగస్టు 30: మండలంలో గత ఆర్థిక సంవత్సరంలో పెన్షన్ల పంపిణీలో వలంటీర్లు చేతివాటం ప్రదర్శించారు. దాదాపు ప్రతి గ్రామంలోనూ చనిపోయిన వ్యక్తులు బతికి ఉన్నట్టు చూపి లక్షల రూపాయలను వారి జేబుల్లో వేసుకున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో చెల్లించిన పెన్షన్ సొమ్ములపై ఆడిట్ అధికారులు సామాజిక తనిఖీ చేపట్టారు. మండలంలో చనిపోయిన వారి పేరిట వలంటీర్లు తీసుకున్న సొమ్ము, నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ అయినవి... మొత్తం రూ.14,17,500 రికవరీ చేయాల్సి ఉందని నివేదిక ఇచ్చారు. దీనిపై రాజవొమ్మంగి ఎంపీడీవో యాదగిరేశ్వరావు మాట్లాడుతూ... ఆడిట్ అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం చాలా గ్రామాల్లో చనిపోయిన వారి పేరుతో వలంటీర్లు పెన్షన్ సొమ్ము తీసుకున్నట్టు గుర్తించామన్నారు. అత్యధికంగా చికిలింత పంచాయతీలో రూ.3,08,500, జడ్డంగి పంచాయతీలో రూ.1,07,250 తీసుకున్నట్టు నివేదికలో ఉందని, సమగ్ర దర్యాప్తు జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఇండియన్ కోస్ట్‌గార్డ్ అధికారి

బొక్కుసొర చేప పరిరక్షణతో సముద్ర జలాల శుద్ధి

కాకినాడ సిటీ, ఆగస్టు 30: బొక్కుసొర చేప పరిరక్షణ ద్వారా సముద్ర జలాల శుద్ధి జరుగుతుందని, చేపల వేట సమయంలో అవి వలలకు చిక్కినా సముద్రంలోనే వదిలి వేయాలని అధికారులు సూచించారు. ప్రపంచ బొక్కుసొర చేప దినోత్సవాన్ని పురస్కరించుకుని అటవీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కాకినాడలోని కుంభాభిషేకం రేవులో మత్స్యకారులు, బోట్ల యజమానులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అధ్యక్షత వహించిన వన్యప్రాణి విభాగం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ మాట్లాడుతూ అంతరించిపోతున్న బొక్కు సొర చేపను వేటాడడం నేరమని, దీని ప్రాముఖ్యతను మత్స్యకారులు గుర్తించాలని వివరించారు. మత్స్య శాఖ ఏడీ ఆర్.సూకరాజు, వి.అనురాధ, ఇండియన్ కోస్ట్‌గార్డ్ ఎస్ఈ బి.ధనుంజయ, మెరైన్ ఏఎస్ఐ బి.ఏలియా, ఫారెస్ట్ సెక్షన్ ఆధికారి ఎస్.వీరభద్రరావు, బోట్ల యూనియన్ అధ్యక్షుడు సంగాడి నాగేశ్వరరావు, మత్స్యకారులు, బోట్ల యజమానులు పాల్గొన్నారు.

వంద రోజుల ప్రణాళికపై ఆరా

హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ అధికారులతో వెబ్-ఎక్స్ మీటింగ్



కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 30: హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ పి.రాజబాబు కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల హౌసింగ్ అధికారులతో శుక్రవారం వెబ్ ఎక్స్ మీటింగ్ నిర్వహించారు. హౌసింగ్ శాఖలో వంద రోజుల ప్రణాళిక పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది అక్టోబరు నాటికి 4,400 ఇళ్లను పూర్తి చేయడానికి వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను పూర్తి స్థాయిలో అమలు చేయాలని, నీటి సరఫరా, అప్రోచ్ రోడ్లు, అంతర్గత రోడ్లు, విద్యుదీకరణ మొదలైన కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ సత్యనారాయణ, ఈఈలు, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై అత్యాచారం

కరప మండలం వేళంగిలో ఘటన

కరప, ఆగస్టు 30: ఇంట్లో ఒంటరిగా ఉన్న 85ఏళ్ల వృద్ధురాలిపై ఒక వ్యక్తి అత్యాచారానికి పాల్పడిన ఘటన గురువారం రాత్రి కాకినాడ జిల్లా కరప మండలం వేళంగి గ్రామంలో జరిగింది. స్థానికులు, కరప పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వేళంగా కరణం గారి వీధిలో ఒక వృద్ధురాలు సోదరితో కలిసి నివాసముంటోంది. సోదరి ఊరు వెళ్లడంతో వృద్ధురాలు ఒంటరిగా ఉంది. గురువారం రాత్రి 11 గంటలు దాటిన తర్వాత అదే గ్రామానికి చెందిన నొక్కు వెంకటరమణ ఇంట్లోకి చొరబడి ఆమెపై అఘాయిత్యానికి పాల్పడినట్టు తెలుస్తోంది. శుక్రవారం ఉదయం శరీరంపై రక్తపు గాయాలతో మూలుగుతున్న బాధితురాలిని గమనించిన స్థానికులు కరప పోలీసులకు సమాచారం అందించారు. కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో పెదపూడి ఎస్ఐ కె.రామారావు నిందితుడు వెంకటరమణను అదుపులోకి తీసుకుని కరప పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధితురాలిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి జరిగిన ఘటనపై విచారణ చేపట్టారు. బాధితురాలిపై అత్యాచారం జరగలేదని, తాగిన మైకంలో నిందితుడు ఆమెపై కత్తితో దాడి చేసినట్టుగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నిందితుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారని, అతడి భార్య ఉపాధి నిమిత్తం కువైట్‌లో ఉంటోందని స్థానికులు తెలిపారు. గతంలో రాయవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో నిందితుడిపై ఇదే తరహా కేసు నమోదైనట్టుగా తెలుస్తోంద. వెంకటరమణ మందు తాగితే సైకోలా ప్రవర్తిస్తాడని గ్రామస్తులు చెప్తున్నారు. బాధితురాలి వద్ద నుంచి స్టేట్‌మెంట్ తీసుకుంటున్నామని, దాన్ని అనుసరించి నిందితుడిపై కేసు నమోదు చేస్తామని ఏఎస్ఐ ప్రసన్నకుమార్ తెలిపారు. కాగా ముదుసలిపై అఘాయిత్యానికి పాల్పడిన మానవ మృగంపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

చింతూరు మండలంలో మరో శిశువు మృతి



చింతూరు ఆగస్టు 30: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలో శుక్రవారం మరో శిశువు మృతి చెందింది. దీంతో ఒక్క ఆగస్టు నెలలోనే మృతి చెందిన చిన్నారుల సంఖ్య ఏడుకు చేరింది. చింతూరు మండలం బోరింగ్ గుంపు (కలిగొండ)కు చెందిన కుంజా జయమ్మ స్థానిక మినీ అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తగా పని చేస్తోంది. ఆమె 8 నెలల గర్భవతి. గురువారం రాత్రి పురిటినొప్పులు రావడంతో జయమ్మను ఆటోలో ఏడుగురాళ్లపల్లి ప్రాథమిక ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. అయితే వర్షం కారణంగా కలిగొండ, పేగ గ్రామాల మధ్య వాగు ఉధృతి పెరిగింది. దీంతో ప్రవాహం తగ్గేవారంతా వేచి చూశారు. శుక్రవారం ఉదయం తగ్గుముఖం పట్టడంతో గర్భిణిని వాగు దాటించారు. సమీపంలోని పేగ గ్రామానికి ఆటోలో చేరుకునే సరికి జయమ్మకు నొప్పులు మరింతగా పెరిగాయి. పేగలో ఒకరి ఇంటి వద్ద ఆమె ప్రసవించింది. అక్కడి నుంచి తిరిగి ఆటోలో ఏడుగురాళ్లపల్లి పీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు తల్లి, బిడ్డలను పరీక్షించి శిశువు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. అనంతరం అంబులెన్సులో చింతూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు శిశువును పరీక్షించి మృతి చెందినట్టు నిర్ధారించారు. దాంతో చేసేదేమీ లేక మృత శిశువును తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లి దహన సంస్కారాలు జరిపారు.



నిందితులను చూపిస్తున్న అటవీ శాఖ అధికారులు

గోనెసంచుల్లో గుట్టుగా... వాహనంలో తరలిస్తున్న 278 తాబేళ్ల పట్టివేత

మోతుగూడెం, ఆగస్టు 30: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలో భారీ సంఖ్యల్లో తాబేళ్లను పట్టుకున్నారు. లక్కవరం అటవీ క్షేత్ర పరిధిలోని సుకుమామిడి నార్త్ బీట్‌లో ఫారెస్ట్ అధికారులు పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానాస్పదంగా వెళ్తున్న ఏపీ20ఏడీ 3789 మహేంద్ర స్కార్పియో వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. అందులో 8 గోనె సంచులను గమనించి తెరవగా తాబేళ్లను గుర్తించారు. వాటిని లెక్కించగా మొత్తం 278 తాబేళ్లు వున్నాయి. వాటిలో 33 చనిపోగా 245 బతికి ఉన్నాయని అధికారులు తెలిపారు. అమలాపురం నుంచి ఒడిసా రాష్ట్రంలోని 79 గ్రామానికి తాబేళ్లను తరలిస్తున్నారు. పొల్లూరుకు చెందిన కార్తిక్ మండల్, కోరుకొండ మండలం జగన్నాథపురానికి చెందిన బలిన సాయికృష్ణలను అదుపులోకి తీసుకుని వారిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేశారు. వాహనాన్ని, తాబేళ్లను సీజ్ చేసి అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. తాబేళ్లను సీలేరు నదిలో వదిలిపెట్టారు. కేసును చేధించిన వారిలో లక్కవరం రేంజర్ జీవీ నానాజీ, డీఆర్వో కె.సత్యనారాయణ, ఫారెస్ట్ బీట్ అధికారులు కె.రామదాసు వెంకట్, సుకుమామిడి నార్త్ బీట్ ఇన్‌చార్జి, తూలుగొండ బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.



కృష్ణవరం టోల్‌గేట్ వద్ద పట్టుకున్న గంజాయి

రూ.4.23 లక్షలు విలువైన 84 కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లతాకుమారి

కిర్లంపూడి, ఆగస్టు 30: కాకినాడ జిల్లా కిర్లంపూడిలో రూ.4.23లక్షలు విలువైన 84.66 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేసినట్టు పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి తెలిపారు. కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను ఆమె వెల్లడించారు. కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు కిర్లంపూడి మండలం కృష్ణవరం టోల్‌గేట్ వద్ద గురువారం ఎస్ఐ సతీష్ సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టారు. విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న కేఏ01 ఏఎం 3279 ట్యాంకరును ఆపి పరిశీలించారు. క్యాబిన్ అరలో, క్లీనర్ సీటు కింది భాగంలో మొత్తం 43 ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆయిల్ ట్యాంకరుతో పాటు ఒక సెల్ ఫోన్, రూ.వెయ్యి నగదు సీజ్ చేశారు. డ్రైవర్ అన్సారీ, పాంగీ సన్యాసిరావు అలియాస్ సంతోష్, కైసర్ల దివాకర్‌లను అరెస్టు చేయగా రాజేష్ టీకే, ధనశేఖరన్ బాలచంద్ర పరారీలో ఉన్నారు. అరెస్టు చేసిన ముగ్గురినీ ప్రత్తిపాడు కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ చెప్పారు. గంజాయి విలువ రూ.4,23,300, ఆయిల్ ట్యాంకరు విలువ రూ.7లక్షలు అన్నారు. విలేకరుల సమావేశంలో జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వనదుర్గ ఆలయంలో

ఘనంగా చండీహోమం

అన్నవరం, ఆగస్టు 30: రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9 గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ,సప్తసతి పారాయణలు,మూలమంత్రజపములు పఠించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలనర్పించి పూర్ణాహుతి గావించారు.

నేడు పింఛన్ల పంపిణీ

ఏర్పాట్లు చేసిన అధికారులు

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 30: ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీని శనివారం ఉదయం 6గంటల నుంచే ప్రారంభించాలని మున్సిపల్ కమిషనర్ భావన ఆదేశించారు. సెప్టెంబర్ 1వతేదీ ఆదివారం సెలవుదినం కావడంతో ఒక రోజు ముందుగానే లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును అందజేయాలన్నారు. ఉదయం 6 గంటల నుంచే ఇళ్ల వద్దకెళ్లి అందజేయాలన్నారు. గతంలో ఆలస్యంగా పంపిణీ చేసిన సచివాలయ సిబ్బందితో మాట్లాడి పునరావృతం కాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. ఒక రోజులోనే వందశాతం పింఛన్ల పంపిణీని పూర్తి చేయాలన్నారు. ఏవైనా కారణాలతో మిగిలినవారికి 2వతేదీన అందజేయాలన్నారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలోని 101 సచివాలయాల పరిధిలో వితంతు, వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు 30,210మంది ఉన్నారు. వారి కోసం రూ.12కోట్ల79లక్షల9500 కేటాయించింది. పింఛన్లు పంపిణీ చేయడానికి 638మంది సచివాలయ సిబ్బందిని నియమించారు.

సామర్లకోట: సామాజిక పింఛన్లను శనివారం సామర్లకోట ఇందిరాకాలనీ నందు పేదలకు పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం మున్సిపల్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పట్టణంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఉదయం 6 గంటలకే అన్ని వార్డుల్లో ప్రారంభిస్తామని, తదుపరి పట్టణంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే చినరాజప్ప పాల్గొంటారని మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య పేర్కొన్నారు. మండలవ్యాప్తంగా పింఛన్ల పంపిణీకి 179మంది సిబ్బందిని ఏర్పాటు చేశామని ఎంపీడీవో డి.శ్రీలలిత చెప్పారు. శనివారం సొమ్ములు పొందలేని వారికి సోమవారం చెల్లిస్తామని చెప్పారు.

'పింఛన్ల పంపిణీలో కూటమి శ్రేణులు పాల్గొనాలి'

కాకినాడ సిటీ, ఆగస్టు 30: శనివారం ఉదయం జరగనున్న ఎన్టీఆర్ సామాజిక పెన్షన్ల పంపిణీలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ప్రతిఒక్కరూ పాల్గొనాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే కార్యాలయం ద్వారా విడుదల చేసిన ప్రకటనలో కోరారు. సెప్టెంబర్ నెల సామాజిక పెన్షన్లు పంపిణీకి 1వ తేదీ ఆదివారం సెలవు కావడంతో, ముందురోజు శనివారం సచివాలయం సిబ్బందితో పంపిణీ చేస్తామని తెలిపారు.

నేడు పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పిఠాపురం, ఆగస్టు 30: పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం ఉదయం 11గంటలకు జరగనున్నది. పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్‌హాలులో జరిగే ఈ సమావేశానికి చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షత వహించనున్నారు. సమావేశం ముందుకు భారీ అజెండా రానున్నది. గత 2 నెలల్లో మున్సిపల్ సమావేశాలు అజెండాపై చర్చించకుండానే వాయిదా పడ్డాయి. దీంతో ఆ సమావేశాల అజెండాతో కలిపి ప్రస్తుత అజెండాలో 105 అంశాలను పొందుపరిచారు. పురపాలకసంఘంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలను కౌన్సిల్‌కు సమాచారం ఇవ్వకుండా భర్తీ చేయడాన్ని నిరసిస్తూ కౌన్సిలర్లు అందరూ గత రెండు కౌన్సిల్ సమావేశాలను బహిష్కరించడంతో అర్థాంతరంగా వాయిదా పడ్డాయి. ఈ నేపథ్యంలో శనివారం సమావేశమయినా సజావుగా జరుగుతుందా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

రేపు నడకుదురులో ఉచిత వైద్యశిబిరం

కరప, ఆగస్టు 30: నడకుదురు జిల్లాపరిషత్ హైస్కూల్‌లో ఆదివారం జనసేన మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు క్యాంప్ కో-ఆర్డినేటర్లు భాస్కర్, సుబ్బు, వెంకటేష్ తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యుల సమక్షంలో ఈ శిబిరం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఇదే శిబిరంలో కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు, ఆపరేషన్లు నిర్వహించనున్నామన్నారు. షుగర్, బీపీ, గుండె, చెవి, ముక్కు, గొంతు, నరాలు, ఎముకలు, కిడ్నీ, స్త్రీ సంబంధిత వ్యాధులకు పరీక్షలు చేసి అవసరమైనవారికి మందులు అందజేస్తామని, శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

2న కాకినాడలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ, ఆగస్టు 30: వికాస ఆధ్వర్యంలో సెప్టెంబరు 2న కాకినాడలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. క్యాపిటల్ ట్రస్ట్ లిమిటెడ్‌లో బీఎం బీక్యూఎం, ఆర్‌వో, ఐఆర్ఈపీ క్రెడిట్ కెపిటల్‌లో సేల్స్ ఆఫీసర్, ఇండో ఎంఐఎం, పానాసోనిక్ కంపెనీల్లో టెక్నీషియన్, రిఫ్యూటెడ్ ఫార్మా కంపెనీలో టెక్నీషియన్, కెమిస్ట్, హెల్పర్ అండ్ ట్రైనీ ఇంజనీర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారన్నారు. ఎస్ఎస్సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్, బీఎస్సీ, ఎంఎస్సీ, బీటెక్(బయోటెక్నాలజీ, మైక్రో బయోలజీ 2023, 2024 పాస్ అవుట్స్) ఉత్తీర్ణులైన 35ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. వారికి నెలకు రూ.12వేల నుంచి రూ.20వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాల ఆధారంగా ఉంటుందన్నారు. అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు కాకినాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరు కావాలన్నారు. వివరాలకు 77993 76111 నెంబరులో సంప్రదించాలని పీడీ తెలిపారు.


ఐసీడీఎస్‌లో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 30: మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ, సాధికారిత అధికారిణి కార్యాలయం, జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ, జిల్లాల బాలల పరిరక్షణ విభాగం, శిశుగృహలో మిషన్ వాత్సల్య స్కీమ్‌లో ఖాళీగా ఉన్న సోషల్ వర్కర్(పురుష)1 పోస్టుకు డిగ్రీ ఉత్తీర్ణులై 25 నుంచి 42ఏళ్ల వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. ఆయా శిశుగృహ 2 పోస్టులకు ఏడో తరగతి ఉత్తీర్ణులై 25 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉన్న వారు అర్హులన్నారు. కాంట్రాక్ట్ ప్రాతిపదికపై భర్తీ చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పీడీ ప్రవీణ తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు సెప్టెంబర్ 7వతేదీ లోపు స్వయంగా గాంధీనగర్ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం : డీఐవో

సామర్లకోట, ఆగస్టు 30: ప్రస్తుత కాలానుగుణంగా వ్యాప్తి చెందే సీజనల్ వ్యాధుల పట్ల వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యాధి నివారణాధికారి డాక్టర్ శ్రీనివాసనాయక్ పేర్కొన్నారు. సామర్లకోట అర్బన్ హెల్త్ సెంటర్ పనితీరును శుక్రవారం డీఐవో పరిశీలించారు. వ్యాధికి గురైన మందులు పంపిణీ చేయడం ఎంత అవసరమో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడం అంతే అవసరమన్నారు. ఆసుపత్రిలో రిజిష్టర్లను పరిశీలించి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. డాక్టర్ సీహెచ్. భవ్యశ్రీ, హెల్త్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గండి పూడ్చివేతలో నిర్లక్ష్యం - పంటపొలాలకు నష్టం



పెదశంకర్లపూడి వద్ద కాలువకు పడిన గండి

ప్రత్తిపాడు, ఆగస్టు 30: మండలంలో పెదశంకర్లపూడి వెంకన్న దొర చెరువుకు వచ్చే ఎర్రకాలువకు గండి పడి నెల రోజులైంది. లంపకలోవ, పెదశంకర్లపూడి గ్రామాల మధ్య మైనింగ్ క్వారీలకు వెళ్లే రోడ్డు ప్రదేశంలో ఈ కాలువకు గండిపడింది. అయితే ఇరిగేషన్ అధికారులు ఈ గండిని పూడ్చకపోవడం వల్ల 25రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఈ గండి సమీపంలోని పంట పొలాలు 3సార్లు ముంపు బారిన పడ్డాయి. వర్షాలు వల్ల వరి పంట పొలాలు ముంపులో ఉండడంతో కుళ్లిపోయి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. నాట్లు వేసిన నెలలోపే ఆ పొలాలు గండిపూడ్చని కారణంగా నీటి ముంపునకు బలై సాగు ప్రారంభంలోనే నష్టపోవాల్సిన దుస్థితి ఎదురైందని రైతులు వాపోతున్నారు. ఈ గండి పూడ్చివేసి పంట పొలాలను కాపాడేందుకు అధికారులు చర్యలుచేపట్టాలని వారు కోరుతున్నారు.

విరిసిన బ్రహ్మకమలాలు

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 30: కాకినాడ సిటీ గర్ల్స్ పాలిటెక్నిక్ త్యాగరాజు వీధిలో మహాసూర్యాస్ రెసిడెన్సీలో మాకిరెడ్డి భాస్కర్ గణేష్‌బాబు నివాసంలో బ్రహ్మకమలం మొక్కకు 9 పువ్వులు గత రాత్రి 11 గంటల సమయంలో విరిశాయి. ఇవి ఏడాదికి ఒకటి, రెండు పూలు మాత్రమే పూస్తాయి. కానీ భాస్కర్ గణేష్ బాబు ఇంట్లో తొమ్మిది పువ్వులు పూయడం ఆశ్చర్యం కలిగించింది. ఈ పువ్వులను వివిధ దేవాలయాల్లో అందజేస్తామని వారు తెలిపారు.



రోజంతా వర్షమే!



పిఠాపురంలో కురుస్తున్న వర్షం, తుని కత్రాల కొండ వద్ద తాండవ నది ప్రవాహం

రహదారులన్నీ జలమయం
పౌర జీవనానికి తీవ్ర అంతరాయం

పిఠాపురం, ఆగస్టు 30: రోజంతా వర్షమే. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతో పాటు మండలాల పరిధిలో గ్రామాల్లో శుక్రవారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకూ వర్షం కురుస్తూనే ఉంది. విరామం లేకుండా వర్షం పడుతుండడంతో పట్టణాల్లో ప్రధాన రహదారులపై నీరు ప్రవహించింది. ఎక్కడికక్కడ డ్రెయిన్లు పొంగిపొర్లాయి. రోడ్లపై జనసంచారం తగ్గిపోయింది. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు వర్షంలో తడిచి ముద్దయ్యారు. పిఠాపురంలో పలు పాఠశాలల ఆవరణలోకి వర్షపునీరు చేరింది. వర్షాలు మరో 2రోజుల పాటు కొనసాగే అవకాశం ఉందన్న హెచ్చరికలతో రైతులు, ప్రజలు కలవరానికి గురవుతున్నారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో రోజంతా ఎడతెరిపి లేకుండా వర్షం కురిసి పౌర జీవనానికి తీవ్ర అంతరాయం కలిగింది. రహదారులు, పల్లపు ప్రాంతాలు చిత్తడిచిత్తడిగా మారాయి. ఈ వర్షాల వల్ల మెట్ట ప్రాంతంలోని వరి, చెరుకు, కూరగాయల పంటలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని రైతులు ఆనందం వ్య క్తం చేశారు. సాగునీటి జలాశయాలు, చెరువులకు పెద్ద ఎత్తున వర్షం నీరు చేరుతుంది.

కొత్తపల్లి: బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో మండలంలో ఉదయం నుంచీ సాయంత్రం వరకు చినుకులు పడుతూనే ఉన్నాయి. ఏమాత్రం తడిసినా జలుబు, తలనొప్పి, జ్వరం వంటి ఇబ్బందులు వస్తాయని ప్రజలు ప్రజలు ఇంటి పట్టునే ఉంటున్నారు. రోజంతా ముసురుగా ఉండంతో తీరప్రాంతాల మత్స్యకారులు వేటను విరమించారు.

కిర్లంపూడి: మండల గ్రామాల్లో చిరుజల్లులు కురిశాయి. వర్షాలకు సింహాద్రిపురం, వేలంక, రాజుపాలెం, వీరవరం రహదారులు అధ్వానంగా మారడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.

కరప: మండలవ్యాప్తంగా శుక్రవారం తెల్లవారుజాము నుంచి నిర్విరామంగా వర్షం పడుతూనే ఉంది. చినుకులు, మధ్య మధ్యలో ఒక మోస్తరు వర్షం కురవడంతో జనం ఇళ్లలోంచి బయటకు రాలేదు. ఈ వర్షంతో వరిచేలకు మేలు చేకూరుతుందని రైతులు చెబుతున్నారు. ఏకధాటిగా కురిసిన వర్షంతో రోడ్లు, పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షానికి రోజు కూలీలు పనుల్లేక ఇళ్లకే పరిమితమయ్యారు.

తుని రూరల్: ఖరీఫ్ పంటలు ఊపందుకుంటున్న తరుణంలో కురుస్తున్న వర్షాలతో మండలంలో ఎక్కడికక్కడే పనులకు ఆటంకం ఏర్పడింది. వరి మడులతోపాటు, పత్తి చేలల్లో నీరు చేరాయి. ఎగువన కురుస్తున్న వర్షాలకు తాండవ నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మండల గ్రామాల్లో సాగునీటి చెరువులు నిండుకుండల్లా దర్శనమిస్తున్నాయి.

తొండంగి: అల్పపీడనం కారణంగా శుక్రవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో ముసురు వాతావరణం ఏర్పడింది. ఇప్పటికే నాట్లు వేసిన మెట్ట పొలాలకు ఈ వర్షం మేలు చేకూరుస్తుందని రైతులు భావిస్తున్నారు. ఏ.కొత్తపల్లి, గోపాలపట్నం, చిన్నయ్యపాలెం తదితర గ్రామాల్లోని మెట్ట భూముల్లో ఇంకా వరినాట్లు కొనసాగుతుండడంతో ప్రస్తుత వర్షం నాట్లు మూన కట్టేందుకు ఉపయోగ పడుతుందంటున్నారు.

జగ్గంపేట: జగ్గంపేటలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు వర్షం పడుతూనే ఉంది. నిత్య శ్రామికులు, కూలీలు, ఇండ్లకే పరిమితమయ్యారు. ఎండ, వాన వాతావరణాల వల్ల సీజన్ వ్యాధులు ప్రబలుతుండటంతో అనేక మంది జ్వరాల బారిన పడుతున్నారు. కమ్యూనిట హెల్త్ సెంటర్ క్యాంపులు నిర్వహించి రోగులకు మందులు అందించే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

'ప్రజా సమస్యలు పరిష్కారం కావడంలేదు'

గొల్లప్రోలు, ఆగస్టు 30: సమావేశాలు వస్తున్నాం. మీరు పెట్టే సమోసాలు తింటున్నాం. వెళ్తున్నం. అంతే తప్ప మేము అడిగే ప్రజాసమస్యలు ఒక్కటి పరిష్కారం కావడం లేదు. ఇదేమి తీరు అంటూ కౌన్సిలర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు రోగాల బారిన పడుతున్నా మీకు పట్టదంటూ అధికారుల తీరుని ఎండగట్టారు. గొల్లప్రోలు నగరపంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ గంద్రేటి మంగతాయారు అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశం వాడివేడిగా సాగింది. 11, 12వ వార్డుల కౌన్సిలర్లు కూరాకుల శేఖర్, గుళ్ల సుబ్బారావులు మాట్లాడుతూ తాగునీటి కోసం లక్షల్లో వ్యయం చేస్తున్నా కుళాయిల ద్వారా మురుగునీరు వస్తున్నదని తెలిపారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పరిస్థితిలో మార్పులేదని మండిపడ్డారు. కలుషితమయిన తాగునీటిని వినియోగిస్తున్న ప్రజలు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. చేపల చెరువుల లీజులను పునర్ధణ విషయంలో జాప్యం ఎందుకు జరుగుతుందని గుళ్ల సుబ్బారావు ప్రశ్నించారు. సమావేశంలో వైస్‌చైర్మన్ గంధం నాగేశ్వరరావు, కమిషనరు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాకే భూ కేటాయింపులు : యనమల

తుని రూరల్, ఆగస్టు 30: రైతుల సమస్యలు పరిష్కరించాకే భూ కేటాయింపులు జరగాలని శాసన మండలి ప్రతిపక్ష నేత, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. తేటగుంట టీడీపీ కార్యాలయంలో పెద్దాపురం ఆర్డీవో సీతారామం, తొండంగి తహసీల్దార్ మురార్జీలతో ఆయన మాట్లాడారు. ఎస్ఈజెడ్ పరిధిలో రైతుల నుంచి సేకరించిన 500ఎకరాల భూములకు సంబంధించి 500 మందికవ పరిహారం అందించాల్సి ఉందని తెలిపారు. గతంలో ఎకరానికి రూ.10లక్షలే చెల్లింపులు జరిగాయని, ఈ పరిహారినికి సానుకూలంగా లేని రైతులు అప్పట్లో నష్టపరిహారం తీసుకోలేదని గుర్తుచేశారు. ఇందుకు సంబంధించి రూ.59 కోట్లు కలెక్టరేట్‌లో డిపాజిట్ అయ్యాయన్నారు. గతంలో చెల్లించిన పరిహారం కన్నా ఎక్కువ మొత్తంలో పరిహారం ఆశిస్తున్నారని వారి మొత్తం అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని తగిన మొత్తంలో పరిహారం చెల్లించాలని అధికారులను ఆయన ఆదేశించారు.

'నేత్రదానంపై విస్తృత అవగాహన'

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 30: నేత్రదానంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ షాన్ మోహన్ పేర్కొన్నారు. కాకినాడ కలెక్టరేట్‌లో జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని జిల్లా అంధత్వ నివారణా సంస్థ, బాదం బాలకృష్ణ ఐ బ్యాంకులు సంయుక్తంగా ప్రచురించిన నేత్రదాన అవగాహన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొన్ని వేలమంది కార్నియల్ అంధులు కంటి చూపులేక చీకటిలోనే ఉండిపోతున్నారనీ వారికి వెలుగులు నింపేందుకు మరణానంతరం నేత్రదానం చేయాలన్నారు. ఈ ప్రచార కార్యక్రమం ఈనెల 25వతేదీ నుంచి సెప్టెంబర్ 8వతేదీ వరకు నిర్వహిస్తున్నారన్నారు. డాక్టర్ బాదం బాలకృష్ణ, దామెర విజయలక్ష్మీ, దాసరి సాయికృష్ణ, పైడా సోమేశ్వరరావు, నానాజీ పాల్గొన్నారు.

'బిల్లుల చెల్లింపునకు నిర్ణయం'

సామర్లకోట, ఆగస్టు 30: 2017-19 కాలంలో పేదలకు అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్మించిన గృహనిర్మాణ పథకంలో తదుపరి బిల్లులు చెల్లించని వారందరికీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం బిల్లులు చెల్లించేందుకు నిర్ణయించిందని సకాలంలో సమాచారం అందించి అధికారులకు సహకరించాలని జిల్లా గృహనిర్మాణ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్వీవీ. సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం జీ.మేడపాడు ఎన్టీఆర్ కాలనీలో బిల్లులు మంజూరు కాక అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్లను పీడీ ఎంపీడీవో డి.శ్రీలలితతో కలిసి పరిశీలించారు. హౌసింగ్ ఈఈ శ్రీనివాస్, మహ్మద్ ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.

వరలక్ష్మీ పూజలకు అనుమతించకపోవడంపై మహిళల ఆగ్రహం

పిఠాపురం, ఆగస్టు 30: వరలక్ష్మీ వ్రతాల టోకెన్లు ఉన్నా పూజలకు అనుమతించకపోవడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పిఠాపురం పాదగయ క్షేత్రంలో 6వేల మంది వ్రతాలు ఆచరించేందుకు వీలుగా టోకెన్లు అందించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. 4 బ్యాచ్‌లుగా వీరికి అవకాశం కల్పించామని చెప్పినప్పటికి భారీ సంఖ్యలో మహిళలు ఆలయం బయటే ఉండిపోయారు. మధ్యాహ్నం 12గంటలకు వారికి వ్రతాలు అయిపోయాయని, ఆలయ సిబ్బంది చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ ఆలయ అధికారులతో మాట్లాడి కొందరు మహిళలకు చీరలు అందజేశారు. అయినప్పటి భారీగా మహిళలు మిగిలిపోయారు. అనంతరం కొందరు జనసేన నాయకులు చొరవ తీసుకుని ఆలయ ప్రాంగణంలో మహిళలు అందరికి చీరలు అందజేయించడంతో వివాదం సద్దుమణిగింది.

వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు



కాకినాడలో వ్రతాలు, గొల్లప్రోలు రూరల్:తాటిపర్తిలో గాజులతో అలంకారం, అన్నవరంలో అలంకరణ

పోర్టుసిటీ(కాకినాడ), ఆగస్టు 30: నగరంలో ప్రసిద్ధి చెందిన బాలాత్రిపురసుందరి సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలకు పెద్దఎత్తున మహిళలు హాజరయ్యారు. శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని దేవాలయం ప్రాంగణంలో నిర్వహించిన పూజలకు 1500మందికి పైగా ముత్తయిదువులు పాల్గొన్నారు. పూజలను కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ప్రారంభించారు. తొలుత అమ్మవారి దర్శనం చేసుకున్నారు. దేవాలయం ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జి, ఈవో సీహెచ్‌వీ భాస్కరరెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలకు చీర, జాకెట్, ప్రసాదం, పసుపు కుంకుమ తదితర 21 రకాల పూజాద్రవ్యాలను ఉచితంగా అందించామన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు చెరుకూరి సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో పూజలు జరిగాయి. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, ప్రధాన కార్యదర్శి తుమ్మల రమేష్, చోడవరపు రంజిత్‌కుమార్ పాల్గొన్నారు. టూటౌన్ సీఐ బూడి ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే పురాతన ప్రసిద్ధి చెందిన బాలాత్రిపురసుందరి సమేత భీమేశ్వరస్వామి దేవస్థానంలో వరలక్ష్మీ వ్రతం పూజలు జరిగాయి. ఆలయ ఈవో రాపర్తి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరిగాయి. ఆలయ ప్రధానార్చకులు కొడమంచలి కార్తీక్ వరలక్ష్మీ వ్రతం పూజలు జరిపించారు.

గొల్లప్రోలు రూరల్: గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామంలోని శివాలయంలో శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. మహాగణపతి పూజ, కలశస్థాపన, తొమ్మిది సూత్రముల గల తోరమును కలశం వద్ద ఉంచి లలితా సహస్రనామాలు, అష్టోత్తరములతో తోర గ్రంధి పూజ జరిపించారు. వరలక్ష్మీదేవికి ప్రీతికరమయిన చారుమతీదేవి వ్రత కథనాన్ని పాలకొల్లు వాస్తవ్యుడు గణపతి శర్మ భక్తులకు వివరించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు నిర్వహించగా, సేవాసమితి సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. తాటిపర్తిలో అపర్ణా సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో అపర్ణాదేవికి కుంకుమార్చనలు, సహస్ర నామార్చనలు నిర్వహించారు. అమ్మవారిని పదివేల గాజులతో అలంకరించారు. వేదపండితులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రధాన అర్చకులు ప్రభాకరశాస్త్రిలు పూజాది కార్యక్రమాలు నిర్వహించగా, ఆలయ కమిటీ చైర్మన్ కుంపట్ల సత్యనారాయణ, సభ్యులు ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.

జగ్గంపేట: జగ్గంపేట పరిసర ప్రాంతాల్లో దుర్గాదేవి అమ్మవారి ఆలయాలు, శివాలయం, విష్ణు ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

ప్రత్తిపాడు: స్థానిక తోటవీధి, ఫారెస్ట్ చెక్‌పోస్టు సెంటర్ పంచాయతీ, కళామందిర్ సెంటర్‌లోని అమ్మవార్ల ఆలయాలు, రాచపల్లి అరుణాచలేశ్వరాలయంలో, ఒమ్మంగి కనకదుర్గ, ధర్మవరం విజయదుర్గ అడ్డ రోడ్డు కనకదుర్గ ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.


కరప: కరప దుర్గాదేవి ఆలయంలో పురోహితుడు కొంపెల్ల చక్రధర్ అమ్మవారికి విశేషాలంకరణ, పూజలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పెనుగుదురు సంతోషిమాత ఆలయానికి మహిళలు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

తుని రూరల్: తునిలో చిట్టూరిమెట్రోలో వరమహాలక్ష్మి ఆలయం, తిమ్మాపురం శ్రీ మహాలక్ష్మి సమేత శ్రీమహావిష్ణు ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరిగాయి. పెద్దఎత్తున భక్తులు పాల్గొనగా పండితులు ప్రదీప్ శర్మ వ్రతాలు చేయించారు. ఆలయ వ్యవస్థాపకులు పోల్నాటి శేషగిరిరావు దంపతులు భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

సామర్లకోట: సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో బాలాత్రిపుర సుందరి అమ్మవారి సమక్షంలో సుమారు 500 మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతపూజల్లో ఆశీనులయ్యారు. ఆలయ ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు సోమేశ్వరశర్మ, చెరు కూరి రాంబాబు వేదమంత్రోచ్ఛారణల మధ్య పూజలను నిర్వహించి కథావృత్తాంతాన్ని సమగ్రంగా వివరించారు. దాతల సౌజన్యంతో తోరాలు, గాజులు, పసుపు, కుంకుమ, వరలక్ష్మి రూపు తదితర పూజా సామగ్రిని మహిళలకు అందజేశారు. నిత్యాన్నదాన పథకంలో భాగంగా సుమారు 1000మంది అన్నప్రసాదాలను స్వీకరించారు.

అన్నవరం: అన్నవరం గ్రామదేవతగా పూజలందుకుంటున్న నేరెళ్లమ్మ అమ్మవారు చివరి శ్రావణ శుక్రవారం సందర్భంగా భక్తులకు గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

వన మహోత్సవం



ఏలేశ్వరంలో మొక్కలు నాటుతున్న చైర్‌పర్సన్

ఏలేశ్వరం, ఆగస్టు 30: మొక్కలు నాటి హరితాంధ్రకు కృషి చేద్దామని చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అన్నారు. పట్టణంలో బాలికోన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం జరిగిన వన మహోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చైర్‌పర్సన్ హాజరై మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అలమండ చలమయ్య, పసుపులేటి శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సామర్లకోట: పట్టణంలో పలు మున్సిపల్ పాఠశాలలో వనమహోత్సవం పేరిట విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమంలో సామర్లకోట ఎంఈవోలు వై. శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య పాల్గొన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనపథకం అమలు తీరును పరిశీలించారు. అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు తోటకూర సాయి రామకృష్ణ ఉపాధ్యాయులు, బీటీఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు లలితాంబ ఉపాధ్యాయులు ఉన్నారు.

తుని రూరల్: తునిలో వన మహోత్సవ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అటవీ శాఖ అధికారులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. టౌన్ సీఐ గీతా రామకృష్ణ, తుని అటవీశాఖ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కె. రాంబాబు, విద్యాకమిటీ చైర్మన్ శ్రీవిద్య, ఎక్స్ మున్సిపల్ చైర్‌పర్సన్ కుసుమంచి శోభారాణి, మాజీ కౌన్సిలర్లు సిద్ధాంతపు సత్తిబాబు ఉన్నారు.

గండేపల్లి: మల్లేపల్లిలో సర్పంచ్ బలిరెడ్డి వరలక్ష్మి గంగరాజు ఆధ్వర్యంలో వన హోత్సవం నిర్వహించారు. మొక్కలు నాటారు. కార్యక్రమంలో తెలగరెడ్డి భద్రరావు, రామకుర్తి నరసింహ, కాటేపల్లి భద్రం, చింతపల్లి వీరభద్రరావు, దార్లంక నూకరాజు, బలిరెడ్డి శివశ్రీధర్ పాల్గొన్నారు.

తొండంగి: పెరుమాళ్ళపురం ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సత్యన్నారాయణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటారు. ఏ.కొత్తపల్లి, బెండపూడి, చిన్నయ్యపాలెం ఉన్నత పాఠశాలల్లో మొక్కలు నాటారు.

'సమస్యల పరిష్కారానికి కృషి'

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 30: కాకినాడ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి 8 సమస్యలపై డీఎంకి ఫోన్ చేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, సాధ్యాసాధ్యాలను పరిశీలించి చర్యలుతీసుకుంటామని మేనేజర్ మనోహర్ తెలిపారు.

అడిషనల్ డీఎంహెచ్‌వో తనిఖీ



తనిఖీ చేస్తున్న రమేష్

సామర్లకోట, ఆగస్టు 30: పట్టణ పరిధిలో అర్బన్ హెల్త్ సెంటర్ పనితీరును జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అడిషనల్ అధికారి డాక్టర్ ఆర్.రమేష్ శుక్రవారం తనిఖీ చేశారు. హెల్త్ సెంటర్ ద్వారా ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై సమీక్షించారు. లాబ్ టెక్నీషియన్ ద్వారా క్షయవ్యాధిగ్రస్తులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. రక్త నమూనాల విశ్లేషణకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. పరిశీలనలో డీపీసీ వెంకటేష్, డీపీఎస్ జగదీష్‌బాబు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీఎస్పీ కమాండెంట్‌గా సోమశేఖర్



సోమశేఖర్‌ని అభినందిస్తున్న అధికారులు

సర్పవరం జంక్షన్, ఆగస్టు 30: ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్‌గా పిట్టా సోమశేఖర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ప్రస్తుతం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఎస్ఈబీ ఏఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. పదోన్నతిలో భాగంగా సోమశేఖర్‌ని కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్‌గా ప్రభుత్వం నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. కమాండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన సోమశేఖర్‌ని అసిస్టెంట్ కమాండెట్లు, ఆర్ఐలు అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

'నాణ్యమైన ఆహారం అందిస్తాం'

గండేపల్లి, ఆగస్టు 30: విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడమే ధ్యేయమని హైస్కూల్ హెచ్ఎం సత్యనారాయణ అన్నారు. 2 రోజుల క్రితం తాళ్ళూరు హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనంలో పాడైపోయిన కోడిగుడ్లు విషయంపై ఆంధ్రజ్యోతిలో వచ్చి కథనానికి హెచ్ఎం స్పందించి శుక్రవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. కాంట్రాక్టర్ వద్ద నుంచి తమకు నిల్వ కోడిగుడ్లు రావడం వల్లే సమస్య వచ్చిందన్నారు. సర్పంచ్ శీలామంతుల వీరబాబు, ఉపసర్పంచ్ పైన్ని వెంకటేశ్వరరావు పాఠశాలలో ఆహారాన్ని పరిశీలించారు. నాణ్యమైన ఆహారం అందించాలని భోజన సిబ్బందికి తెలిపారు.

సుద్దగడ్డకు మళ్లీ వరద

గొల్లప్రోలు, ఆగస్టు 30: సుద్దగడ్డకు మళ్లీ వరద నీరు చేరుతున్నది. 24గంటలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గొల్లప్రోలు వద్ద సుద్దగడ్డ(కొండ)కాలువ వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నది. పట్టణ శివారులోని జగనన్న కాలనీ రహదారిపైకి శుక్రవారం సాయంత్రం 2అడుగుల ఎత్తులో వరద నీరు ప్రవహిస్తున్నది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం రాత్రి వరకూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో శనివారం వరద ఉధృతి మరింత అధికమవుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వారం వ్యవధిలో వరద నీరు కాలనీ రహదారిపైకి ఇది రెండవ సారి. వరద నీటిలోనే కాలనీవాసులు రాకపోకలు సాగిస్తున్నారు.

చేబ్రోలులో అనధికారికంగా బ్లాస్టింగ్

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 30: చేబ్రోలు ఆదర్శ్ ఇంజినీరింగ్ కళాశాల వెనుకభాగంలో అన ధికారికంగా బ్లాస్టింగ్ జరుగుతోంది. అక్కడ ఉన్న రాతి ప్రాంతాన్ని పేలుడు పదార్థాలు వినియోగించి పేల్చివేస్తున్నట్టు చెబుతున్నారు. ఈ బ్లాస్టింగ్‌లో కళాశాల విద్యార్థులతో పాటు బీసీ వసతి గృహంలో ఉన్న విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. కళాశాల జరుగుతున్న సమయంలోనూ బ్లాస్టింగ్ చేస్తున్నారని చెబుతున్నారు. అనధికారిక బ్లాస్టింగ్ నిర్వహిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఎనిమిది మందికి జరిమానా, ఒకరికి జైలు శిక్ష

కిర్లంపూడి, ఆగస్టు 30: కిర్లంపూడి పోలీస్‌స్టేషన్ పరిధిలోని డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడ్డ 9మందిని శుక్రవారం ప్రత్తిపాడు కోర్టులో హాజరుపరిచినట్టు ఎస్ఐ సతీష్ తెలిపారు. వీరిలో 8మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా, ఒకరికి 2రోజులు పాటు జైలు శిక్ష విధించారు.

ఏడుగురికి జరిమానా...

జగ్గంపేట, ఆగస్టు 30: జగ్గంపేట ఎస్ఐ టి.రఘునాథరావు ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. పట్టుబడిన వారిని శుక్రవారం పెద్దాపురం కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ జి.కృష్ణశేషచార్య ఏడుగురికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున రూ.70వేలు జరిమానా విధించారు.

ఆర్టీసీ డ్రైవర్స్, కండక్టర్స్ నిరసన

ఏలేశ్వరం, ఆగస్టు 30: ఏపీపీటీడీ పిలుపు మేరకు శుక్రవారం డ్రైవర్స్, కండక్టర్స్ స్థానిక ఆర్టీసీ డిపో గేటు వద్ద నిరసన తెలిపారు. సర్వీసులో చనిపోయిన ఉద్యోగులకు అంత్యక్రియలు నిమిత్తం రూ.25వేలు మంజూరు చేయాలని, పీటీడీ సర్వీసులో ఉన్న ఉద్యోగులకు వేత బాకాయిలు చెల్లించాలని నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. శేఖర్, అప్పలరాజు, చింతపల్లి సతీష్, చినబాబు, శివ తదితరులున్నారు.

తుమ్మల బాబును కలిసిన కమిషనర్

సామర్లకోట, ఆగస్టు 30: జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబును శుక్రవారం సామర్లకోట మున్సిపల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శ్రీవిద్య కలిసి మొక్క అందించి అభినందించారు. పట్టణాభివృద్ధికి అధికారులకు సహకరించాలని తుమ్మల బాబును శ్రీవిద్య కోరారు.

యూటీఎఫ్ ఆందోళనలు

ప్రత్తిపాడు, ఆగస్టు 30: ప్రత్తిపాడులో తహశీల్దార్ కార్యాలయం వద్ద శనివారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ధర్నా, ఆందోళన నిర్వహించారు. యూపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్‌కు అందజేశారు. యూటీఎఫ్ నాయకులు దొడ్డిపట్ల రాజబాబు, ఆర్.రామలింగేశ్వరరావు, చుక్కల గణేష్, ఎంవీ రమణ, నాగేశ్వరరావు, రవితేజ, స్వామికుమార్, రవి తదితరులున్నారు.

కొత్తపల్లి: ఉపాధ్యాయ సంఘాలను మోసం చేస్తూ యూపీఎస్ లాంటి అంకెల గారడీ పెన్షన్ స్కీమ్ వద్దని, పాత పెన్షన్ స్కీమ్ పునరుద్ధరించాలని యూటీఎఫ్ కొత్తపల్లి మండల శాఖ తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. యుటీఎఫ్ జిల్లా నాయకుడు గణేశ్వరరావు, మండలాధ్యక్షుడు జిరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.